ప్రజాశక్తి
మంగళవారం 30 డిసెంబరు, 2025 8 పేజీలు
శ్రీకాకుళం

కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనలు

రద్దు చేయాలి

(వార్త...మెయిన్‌లో)

పచ్చని ఉద్యానంలో

ఎయిర్‌పోర్టు అవసరమేమిటి?

- భోగాపురంలోనే కార్గో ఎయిర్‌పోర్టు నడపొచ్చు
- విమానాశ్రయ ప్రతిపాదనను విరమించుకోవాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పచ్చని ఉద్దాన ప్రాంతంలో ఎయిర్‌పోర్టు అవసరమేమిటని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వేల ఎకరాలు కావాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భోగాపురంలోనే కార్గో సర్వీసును నడపాలని, మందస కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణపు ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానంతర ఉద్యమాలపై నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదేశించిందని, ఉద్యమాల అణచివేతకు కేంద్ర ప్రభుత్వం కుట్రలకు సిద్ధమవుతోందని తెలిపారు. మోడీ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను అణచివేసేందుకు ఇప్పటికే ఎన్నో కుతంత్రాలు పన్నారని, ఇప్పుడు కొత్తగా 50 ఏళ్ల నుంచి పుట్టిన ఉద్యమాలు, వాటి ఫలితాలు, వాటిని ముందుండి నడిపించిన వ్యక్తుల వివరాలు కావాలని డిజిపిలకు లేఖలు రాశారని చెప్పారు. ఆనాడు పార్లమెంట్‌లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉండడంతో జాతీయ ఉపాధి హామీ చట్టం వచ్చిందని, నేడు మోడీ ప్రభుత్వం చట్టానికి మహాత్మాగాంధీ పేరుని తొలగించడంతో పాటు నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ కేంద్రాన్ని ఆ ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తుంటే, (మిగతా...2)

మహాసభలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, పొందూరు, కొత్తూరు

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు నిర్వహించే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నాయకులు జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. పలురంగాల కార్మికులను కలిసి కరపత్రాలు అందించి మహాసభల ప్రాముఖ్యతను వివరిస్తూ, వారిని సమాయత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎచ్చెర్ల, పొందూరు, కొత్తూరులో సోమవారం పోస్టర్ ఆవిష్కరణలు, ప్రచార సభలు నిర్వహించారు. జనవరి నాలుగో తేదీన చలో విశాఖపట్నం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపు నిచ్చారు. ఎచ్చెర్ల, పొందూరులో సిఐటియు అఖిల భారత మహాసభలు ప్రచారంలో ఆయన మాట్లాడారు. జనవరి 4న మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం ఆర్.కె బీచ్ వద్ద భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ లు ప్రయోజనాలు కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు (మిగతా...2)

కొత్తూరులో ఆటోలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

పిజిఆర్ఎస్‌కు 163 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో సీనియర్ల వేధింపులు, అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న మృతి చెందిన విద్యార్థి పి.సృజన్ కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల జెఎసి నాయకులు కంఠ వేణు, తైక్వాండో శ్రీను, వి.సురేష్ కోరారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి పిజిఆర్ఎస్ (ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక)లో సోమవారం అర్జీలు స్వీకరించారు. సృజన్ తల్లిదండ్రులు కుటుంబసభ్యులతో కలిసి దళిత సంఘాల నేతలు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సృజన్ ఆత్మహత్య ఘటనకి సంబంధించి నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ కాస్ట్ (ఎన్‌సిఎస్‌సి) విచారణ సమయంలో కేవలం అది ఆత్మహత్య ఘటనగానే కాకుండా కుల వివక్ష, ర్యాగింగ్, శారీరక, మానసిక వేధింపుల నేపథ్యంలో జరిగిన ఘటనగా అభిప్రాయపడ్డ విషయాన్ని నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మృతుని కుటుంబానికి చట్టబద్ధంగా అందాల్సిన ప్రయోజనాలను అందించాలని ఎన్‌సిఎస్‌సి సిఫార్సు చేసిందని తెలిపారు.

జిల్లాలో అర్హత గల ఎపి విలేజ్ వార్డు హెల్త్ సెక్రటరీలకు ఎన్ఎన్ఎంలు ఉద్యోగోన్నతులు కలించాలని ఎపి విలేజ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డి.సాయిప్రసాద్, రంగమ్మతో తదితరులు వినతిపత్రం అందజేశారు. పొందూరు మండలం కృష్ణాపురం విఆర్ఒ విధులు దుర్వినియోగం చేశారని, తమ భూములు చెరువు భూమిగా చిత్రీకరించారని, దర్యాప్తు చేసి న్యాయం చేయాలని ఆ గ్రామానికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. తమకు భూ హక్కు ధృవీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. తనకు సుగర్ కారణంగా కాలు తీసివేశారని ఐదు నెలల నుంచి ఫించన్ కోసం తిరుగుతున్నానని, పింఛను అందజేయాలని రణస్థలం మండలం చిల్లపేట రాజాం కు చెందిన అసిరిరెడ్డి కోరారు. (మిగతా...2)

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

క్షేత్రస్థాయి ఉద్యోగుల పనితీరు మారాలి

ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఉపాధి హామీ కింద గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి ఉద్యోగులు నిర్లక్ష్యం వహించడంపై పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులు పూర్తి చేసే విషయంలో ఉద్యోగుల పనితీరు మారాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించి మంజూరైన ప్రతి అభివృద్ధి పని మార్చి 31వ తేదీ లోపు (మిగతా...2)

555 మొబైల్ ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దొంగిలించబడిన, పోగొట్టుకున్న రూ.86 లక్షల విలువ గల 555 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులకు ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ద్వారా ఈ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాదిలో 2,442 ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదులు రాగా, అందులో సుమారు 1,390 మొబైల్ ఫోన్లను ట్రేస్ అవుట్ చేశామన్నారు. మిగిలిన 330 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి త్వరలోనే బాధితులకు అందజేయనున్నట్లు ఎస్‌పి తెలిపారు. మొబైల్ ఫోన్‌లో ఎవరైనా కొత్త వ్యక్తి (మిగతా...2)

సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

మారని యజమాన్యాల తీరు... ఆగని కార్మికుల పోరు

- కార్మికుల తొలగింపునకు యత్నం
- పోరాటాలతో అడ్డుకున్న సిఐటియు
- సమస్యల పరిష్కారం రోడ్డెక్కిన పలు రంగాల కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం, యాజమాన్యాల తీరుకు నిరసనగా గతేడాది కాలంలో కార్మికులు అనేక రూపాల్లో పోరాటాలు సాగించారు. కార్మికుల అక్రమ తొలగింపు, పని దినాల కోసం ఈ ఏడాదిలో అలుపెరగని పోరాటాలు సాగించారు. జిల్లాలోని పలు పరిశ్రమల్లో పని గంటల అమలు, కార్మికుల భద్రతను యజమాన్యాలు పట్టించుకోకపోవడంపై కార్మికుల్లో ఆగ్రహం నెలకొంది. పుండు మీద కారం చల్లినట్టు టిడిపి కూటమి ప్రభుత్వం యాజమాన్యాలకు వత్తాసు పలికేలా పని గంటలను ఎనిమిది నుంచి 13 గంటలకు పెంచింది. దీనిపై కార్మికులు మండిపడుతున్నారు. మరోవైపు జిల్లాలో పారిశ్రామిక రంగంలో నిస్తేజం అలుముకుంది. ఏడాది కాలంలో జిల్లాకు కొత్తగా ఒక్క పరిశ్రమా రాలేదు. దీంతో ఎప్పటిమాదిరిగానే జిల్లాలో వలసల పరంపర కొనసాగుతోంది.

జిల్లాలోని కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాడుతోంది. రణస్థలం మండలం శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2లో 30 ఏళ్లు పూర్తయిన కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నించిన సందర్భంలో సిఐటియు ఆధ్వర్యాన (మిగతా...2)

శ్రమ అవార్డును అందుకుంటున్న నల్లి ధర్మారావు

నల్లి ధర్మారావుకు 'శ్రమ' అవార్డు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రముఖ కవి, జర్నలిస్టు నల్లి ధర్మారావుకు శ్రమ అవార్డు దక్కింది. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ ఆవరణలో నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ సోమవారం ప్రదానం చేశారు. తొలి రోజు ఉత్సవాల్లో సీనియర్ సంపాదకులు సామాజిక, రాజకీయ విశ్లేషకులు, సాహితీవేత్త తెలకపల్లి రవికి అందజేయంగా, రెండో రోజు నల్లి ధర్మారావు, కళింగాంధ్రకు చెందిన మరో ప్రముఖ కవి గంటేడు గౌరునాయుడుకు ప్రకటించారు. ప్రతిష్టాత్మకమైన అవార్డు దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. విశాఖ ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ ఆదినారాయణ, శ్రీకాకుళం జిల్లా సీనియర్ నాయకులు ఎన్.ఈశ్వరరావు, ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యులు డి.మహారాణా, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెండి నర్సింగరావు, గరిమెళ్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, వాసు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దాతల సాయమే ఆయువుగా...

ప్రజాశక్తి- కవిటి

దాతలు అందించే సాయమే ఆధారంగా ఓ అబల ఆయువు కోసం పోరాడుతోంది. మండలంలోని రామయ్యపుట్టుగకు చెందిన ఎస్.నాగమణి తీవ్ర ప్రాణాంతక వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆమెది రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో ఇప్పటికే చికిత్స కోసం అందినంత వరకు డబ్బు ఖర్చు చేయగా, ప్రస్తుతం మందులు కొనుగోలు చేయలేని దీనస్థితిలో ఉన్నారు. భర్త ధర్మారావు జీవనోపాధి కోసం నడుపుతున్న చిన్న సెలూన్ షాపే ఆ కుటుంబానికి ఆధారం. ఈ విషయం తెలుసుకున్న కేశుపురానికి చెందిన శ్రీకాళీ సేవా సమితి సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి తక్షణ సహాయంగా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఎయిర్‌పోర్టు అవసరమేమిటి?

వారికి అండగా నిలిచిన అనకాపల్లి సిపిఎం నాయకులు అప్పలరాజుపై పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని అంతా పోలీస్ రాజ్యమే ఉందని గొంతెత్తిన ఆయన, అధికారం చేపట్టిన తర్వాత చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉంటే మెడికల్ కళాశాలలో సక్రమంగా నిర్వహించలేమని చెప్తున్న మంత్రులకు మంగళగిరిలో ఉన్న ఎయిమ్స్ ఎంత మంచిగా నడుస్తుందో కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే ఆలోచనను విరమించుకోవాలని హితవు పలికారు. అమరావతి కోసం 54 వేల ఎకరాలు భూములు తీసుకుని 12 ఏళ్లు అవుతున్నా భూములు ఇచ్చిన రైతులకు ఒక పట్టానైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. చంద్రబాబు నోరు విప్పితే అభివృద్ధికి వేల ఎకరాలు కావాలని అనడం తప్ప ప్రగతి మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. ఖమ్మంలో జనవరి 18న నిర్వహించున్న సిపిఐ శత వార్సికోత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జె.వి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్రను ఏదో అభివృద్ధి చేస్తున్నామని చెప్తున్న పాలకులు, కాలుష్య కారక పరిశ్రమలను నెలకొల్పి ఆ ప్రాంతాన్ని కాలుష్య కోరల్లోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. తీవ్ర కాలుష్యం, పర్యావరణానికి ముప్పు నేపథ్యంలో ప్రజలు ఉద్యమించడంతో సోంపేట, కాకరాపల్లి పవర్ ప్లాంట్‌లు రద్దయ్యాయని గుర్తుచేశారు. ఇప్పుడు సరుబుజ్జిలిలో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పాల్గొన్నారు.

ఆగని కార్మికుల పోరు

కార్మికులు అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. ప్రస్తుతం కల్పిస్తున్న 14 రోజుల పని దినాలు కాకుండా పూర్తిస్థాయిలో పని కల్పించడం కోసం మరోవైపు న్యాయ పోరాటం సాగిస్తోంది. సిఐటియు చేసిన సాగించిన పోరాటాల ఫలితంగా నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమలో వేతన ఒప్పందానికి యాజమాన్యం ముందుకొచ్చింది. మందస, కోటబొమ్మాళి రైస్ మిల్లు కార్మికుల సమస్యలపై పోరాడి విజయం సాధించారు. నీలం జ్యూట్ పరిశ్రమ అక్రమ లాకౌట్‌కు వ్యతిరేకంగా కార్మికుల పక్షాన పోరు సల్పింది. ఎచ్చెర్ల బాట్లింగ్ కార్మికుల సమస్యలపై పోరాడింది. వీటితోపాటు స్కూల్ స్వీపర్స్, పలాస లారీ డ్రైవర్స్, పొందూరు గ్యాస్ డెలివరీ బాయ్స్, కంచిలి వేర్‌హౌస్ హమాలీ కార్మికులకు అండగా పోరాడారు.

సమస్యలపై గళమెత్తిన పలురంగాల కార్మికులు

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 12న అంగన్‌వాడీలు మహాధర్నా చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు, మెనూ ఛార్జీలు పెంచాలన్న డిమాండ్లతో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జిల్లా

మొదటిపేజీ తరువాయి

నలుమూలల నుంచి భారీగా కార్యకర్తలు, హెల్పర్లు తరలి వచ్చి ప్రభుత్వంపై ఆగ్రహం వెలిబుచ్చారు. మరోవైపు ఎపి పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యాన ఉద్యోగులు స్థానిక జిల్లా సహకారశాఖ అధికారి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. విఆర్‌ఎల పే స్కేల్ అమలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు.

రాజకీయ వేధింపులపై ఆందోళనబాట

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చా స్కీమ్‌వర్కర్లకు గ్రామాల్లో వేధింపులు మొదలయ్యాయి. నందిగాం మండలం కొత్త అగ్రహారంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు మడ్డు సావిత్రమ్మను తొలగించారు. మెళియాపుట్టిలో ఓ వంట కార్మికురాలిని తొలగించేందుకు ప్రయత్నించగా మధ్యాహ్న భోజన పథం కార్మికుల సంఘం అడ్డుకోవడంతో అది నెరవేరలేదు. గార మండలం చిన్నముదిటిపేట గ్రామంలో వేధింపులకు గురవుతున్న ఓ అంగన్‌వాడీ కార్యకర్తకు యూనియన్ అండగా నిలిచింది. సంతబొమ్మాళి మండలం నట్టివలస పంచాయతీ గెద్దలపాడులో అంగన్‌వాడీ కార్యకర్తను తొలగించేందుకు రూ.1.90 లక్షలకు వేలం పాట నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారన్న వార్తలతో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జోక్యం చేసుకుని అధికారులకు ఫిర్యాదుతో ఆగింది. ఇదే గ్రామంలో ఆశా కార్యకర్త ఉద్యోగానికీ వేలం పాట నిర్వహించడంతో ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతిఘటించడంతో ఆ ప్రకియ నిలిచింది

పారిశ్రామిరంగంలో అలుముకున్న నిస్తేజం

జిల్లాలో గతేడాది కాలంలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. రణస్థలం మండలం సంచాంలో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించలేదు. రణస్థలం మండలం చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తితో పాటు ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించినా, పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి పెండింగ్‌లో ఉంది.

మహాసభలపై విస్తృత ప్రచారం

అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, లబ్ధిదారులకు క్వాంటీటి, పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో శారద, పుష్ప, లలిత, అమృత, కనకం, ఆర్.చంద్రమౌళి, ఎం.మాణికుమారి, పి.సునీత కుమారి, పద్మ, డి.లక్ష్మీరత్నం, ఎ.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు మండల కేంద్రంలో ఆటోలో ప్రచారం చేపట్టారు. మహాసభలకు కార్మికులు తరలిరావాలని సిఐటియు మండల కన్వీనర్ పనస రమేష్. ప్రజాసంఘాల నాయకులు సిర్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాలు నాయకులు రవి, గణపతి, నిమ్మక అప్పన్న, సుధ, రమేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పనితీరు మారాలి

పూర్తి చేయాలని ఆదేశించారు. సకాలంలో పనులు పూర్తి చేసిన నిర్మాణాలకు నిధుల చెల్లింపు, బిల్లులు తెచ్చే బాధ్యత తనదని స్పష్టం చేశారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు కేవలం పరిపాలనా పనులు మాత్రమే చూసుకుని, అభివృద్ధి పనులను పక్కనపెడుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు పూర్తి కాకుంటే అటువంటి కార్యదర్శులను బాధ్యులను చేసి చర్యలకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. గత ప్రభుత్వం రూ.1800 కోట్లను పంచాయతీ నిధుల నుంచి వేరే పనులకు నిధులను దారిమళ్లించడంతో గ్రామ పంచాయతీలకు గడ్డు పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీలకు అన్నివిధాలుగా నిధులు మంజూరు చేస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించనున్నామన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు బెండి గోవిందరావు, ప్రత్యేక ఆహ్వానితులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఎంపిడిఒ సీపాన రామ్మోహన్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

555 మొబైల్ ఫోన్లు రికవరీ

సిమ్ కార్డు వినియోగించిన వెంటనే ఆ మొబైల్‌ను ఈ పోర్టల్ ద్వారా ట్రేస్ చేయనున్నట్లు చెప్పారు. అలా గుర్తించిన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామన్నారు. ఇప్పటివరకు పోర్టల్ ద్వారా మొత్తం 4,770 ఫిర్యాదులు స్వీకరించగా, గతేడాది 1600 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. పోగొట్టుకున్న ఫోన్లలో 60 శాతం ఫోన్లకు ట్రేసబిలిటీ ఉండగా, వాటిలో రికవరీ శాతం సుమారు 80 శాతం ఉందని, మిగిలిన 20 శాతం ఫోన్లనూ గుర్తించి రికవరీ చేస్తామన్నారు. ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, అలా చేస్తే ఫోన్ రికవరీ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల నియంత్రణతో పాటు బాధితులకు న్యాయం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందన్నారు. దర్యాప్తు అధికారులు అదనపు ఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ ఇమాన్యుయల్ రాజు, ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్, ఐటి సెల్ సిఐ టి.శ్రీను, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

పిజిఆర్ఎస్‌కు పలు శాఖల నుంచి 163 అర్జీలు స్వీకరించారు. అనంతరం ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఫిర్యాదుల పరిష్కారంపై అధికార యంత్రాగం దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, డిఆర్ఒ లక్ష్మణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

జైలులో వివక్షకు తావుండకూడదు

ప్రజాశక్తి - గార

జైళ్లలో కుల, మరే ఇతర వివక్షలకు తావుండకూడదని, ఖైదీలందరూ సద్బుద్ధితో మెలిగి సామాజిక పౌరులుగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మండలంలోని అంపోలులో గల జిల్లా జైలును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తదితరులతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2023 జైలు మాన్యువల్‌లో నిర్దేశించిన నిబంధనల ప్రకారం జైలులోని రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా విచారణకు హాజరు పరచని ఖైదీల వివరాలను, గరిష్ట శిక్షా కాలంలో సగం గానీ మూడింట ఒక వంతు పూర్తి చేసుకున్న అండర్ ట్రయల్ ఖైదీల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. తగినంత న్యాయ ప్రాతినిధ్యం లేని ఖైదీలకు తక్షణమే చట్టపరమైన జోక్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. జైలులో పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పనితీరును సమీక్షించారు. రిజిస్టర్లు, కేసుల రికార్డుల నిర్వహణను తనిఖీ చేయడంతో పాటు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సభ్యులు క్రమం తప్పకుండా జైలును సందర్శించి ఖైదీలతో మాట్లాడాలని సూచించారు.

మహా రాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు వారి దివ్య సముఖమునకు

IA.NO.70/2020 in OS No.16/2015

Between:-
నత్తల అప్పారావు మరియు వగైరాలు ......పిటిషనరలు/వాదులు
And:-
నత్తల సోమయ్య(డైడ్) మరియు వగైరాలు ......రెస్పాడెంట్స్

R-10: నత్తల అప్పన్న, S/o లేటు రాజరావు, సాకేన బాతువ గ్రామం, జ. శిగడాం మండలం బాతువ పోస్ట్, శ్రీకాకులం జిల్లా.

పై నెంబర్ IAలో పిటిషనర్‌లు/వాదులు పొందూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్‌లో IA.No:70/2020inOS.No:16/2015 ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో మీకు IA నోటిస్‌లు చాలా సార్లు పంపించినప్పటికి మీరు తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. మీ మీద పైనెంబర్ ఫైనల్ డిక్రీ పిటిషన్ వేసినందున మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది గారి ద్వారా గాని **తే. 09-01-2026 దిని ఉదయం గం॥ 10-30ని॥లకు** పై కోర్ట్ వారి ఎదుట హాజరై మనవి చేసుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమనందు తీర్మానం చేయడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

వై. సత్య శ్రీనివాస్
న్యాయవాది,
సెల్: **8309885495.**

పొందూరు
29-12-2025.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి పాతపట్నం వారి కోర్టులో

O.S. No. 50/2025

బిట్వీన్:
సురవరపు వజ్రాలమ్మ .....వాది
మరియు:
ఎరుసు యువరాజు రెడ్డి .....ప్రతివాది

ప్రతివాదికి నోటీసు:

ప్రతివాది అయిన ఎరుసు **యువరాజు రెడ్డి,** S/o ఎరుసు నల్లయ్య రెడ్డి, వయసు 42 సం॥లు, వ్యాపారం, R/o డోర్ నెం.4-712, రాజవీధి, మెళియాపుట్టి గ్రామం/పోస్ట్/మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్, అనే ఆసామీ వారు పై నెంబరు దావాలో **తేది 02-01-2026న ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో** స్వయంగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై పైదావాలో మీ ఆక్షేపనలు కోర్టులో తెలుపు కోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమయినది.

(శ్రీ కోర్టు వారి ఉత్తరువులతో)

బి. ఇ. సత్యనారాయణ
వాది తరపు న్యాయవాది,
పాతపట్నం, శ్రీకాకుళం జిల్లా,
ఫోన్: **9441121146.**

IN THE HONOURABLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISON) AT SRIKAKULAM

O.S. 16/2025

Between:
Budumuru Varada Rajulu .....Plaintiff
And:
Gunnu Srinivasa Rao .....Defendants

To,
Gunnu Srinivasa Rao, S/o Krishna rao, Door No: 1-79b, official colony, Ponduru, Ponduru mandalam, Srikakulam District

కోర్ట్ సమను నోటీసు

పై నెంబర్ దావాలో మీరు ప్రతివాది అయి వున్నారు. మీ పై ఎన్ని మార్లు కోర్ట్ సమన్లు జారి చేసియున్నను మీరు రెస్పాండ్ కానందున,, కోర్ట్ వారి ఆర్డరు మూలముగా మీరు **తేదీ 31-12-2025 న ఉదయమ 10-30 నిమిషములకు** స్వయముగా గాని, వకీలు ద్వార గాని పై కోర్ట్ వారి ఎదుట హాజరై, ఏవిధమైన ఆక్షేపనలు వున్న ఎడల తెలియ చేయగలరు. లేని యెడల మీ పరోక్షమున పై దావా తీర్మానము చేసి మీకు పరోక్షమున తీర్పు కాగలదని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

// BY ORDER OF THE COURT //

కూన సన్యాసప్పుడు
న్యాయవాది,
పొందూరు.

పొందూరు
తేదీ **29-12-2025**

రాజ్యమేలుతున్న

మనువాదం.. మార్కెట్‌వాదం

- భావ వ్యక్తీకరణపై దాడి
- మానవతా సందేశాలతో జాతీయ స్ఫూర్తికి పునరంకితం కావాలి
- 'శ్రామిక ఉత్సవ్'తో నవ్యాంధ్రకు నవ్య సందేశం విశాఖ నుంచే..
- ప్రముఖ కవి, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'దేశభక్తి వేరు.. ద్వేష భక్తి వేరు. ద్వేషంతో భారతదేశ సంస్కృతి, వారసత్వం నిలబడదు. నేడు 'పబ్లిక్ స్పేస్ (జనం పరిధి) హరించుకుపోయి కార్పొరేట్ స్పేస్ (పెట్టుబడిదారుల పెత్తనం) ఆక్రమిస్తోంది. ప్రతిదీ మానిటైజేషన్, ప్రైవేటైజేషన్ అంటున్నారే తప్ప హ్యూమనైజేషన్ (మానవీయత)కు ప్రాధాన్యమివ్వడం లేదు. మనువాదం.. మార్కెట్‌వాదం నేడు రాజ్యమేలుతున్నాయి. లేబర్ కోడ్‌లు, నిర్బంధ చట్టాలు శ్రమజీవులపై విసిరే కేంద్ర విధానాలపై ప్రజా తిరుగుబాట్లు జరిగితే తప్ప పాలకుల తీరులో మార్పు రాదు' అని ప్రముఖ కవి, రచయిత, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. విశాఖ నగరంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభకు సన్నద్ధంగా ఈ నెల 27 నుంచి తలపెట్టిన 'శ్రామిక్ ఉత్సవ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రవి 'ప్రజాశక్తి' విశాఖ బ్యూరోచీఫ్ ఎన్.మధుతో తన భావాలను పంచుకున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. పిపిపిపి పదాలే తప్ప ఈజ్ ఆఫ్ పీపుల్ లివింగ్.. ఈజ్ ఆఫ్ వర్కింగ్ అనే మాటలు ఎక్కడా కానరావడం లేదంటూ తన రాజకీయ బాణాలను సంధించారు. ఒక్కమాటలో చెప్పాలంటే నవ్యాంధ్రప్రదేశ్‌కు నవ్య సందేశాన్ని విశాఖపట్నం నుంచి ఇచ్చేందుకే 'శ్రామిక ఉత్సవ్' ద్వారా రంగం సిద్ధమైందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ పరిణామాల గురించి వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే...

భావ వ్యక్తీకరణ, మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు.. దాడులు

జాతీయ స్థాయిలో భావన ప్రకటనా స్వేచ్ఛ అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏలిన వారిని పొగిడినంతవరకే మీడియాకు స్వేచ్ఛ తప్ప విమర్శించే హక్కు లేకుండా పోయింది. ఇది కేవలం మీడియాకు మాత్రమే కాదు. సోషల్ మీడియాపైనా, కవిత్వం, సాహిత్యం, రచనలు, అభ్యుదయ సినిమాలపైనా ఈ దాడులు జరుగుతున్నాయి. కొన్ని సినిమాలైతే విడుదల కాకముందే దాడులకు గురౌతున్నాయి. సమాజంలో సగభాగమైనటువంటి మహిళలపై దారుణమైనటువంటి భాషలో విమర్శలు గుప్పించడం చూస్తున్నాం. పత్రికలు సంపాదకీయాలు రాసినా, ప్రధాన రాజకీయ పార్టీలు చెప్పినా.. మేం మాట్లాడిందే సరైనదంటూ మనుషుల పట్ల గౌరవం తగ్గే విధంగా 'మనువాద భావజాలం రాజ్యమేలుతోంది'. మనువాద భావజాలం, మనువాద మార్కెట్ మధ్య ప్రజానీకం, శ్రామికవర్గం, మహిళలు నలిగిపోతున్నటువంటి నేటి పరిస్థితుల్లో మానవతా సందేశం ఇచ్చి మరోసారి జాతీయ స్ఫూర్తికి పునరంకితం కావాల్సి ఉంది. దేశ భక్తి వేరు.. ద్వేష భక్తి వేరు.. ద్వేషంతో దేశం ఎప్పుడూ నిలబడదు. భిన్నమతాలు, భిన్న సంస్కృతులు.. వీటన్నిటికీ నిలయమైన ఈ విశాల భారతదేశంలో మానవతా సందేశాలతో ప్రజలంతా కలసి ముందుకు వెళ్లాలని నాడే గురజాడ, శ్రీశ్రీ పేర్కొన్నారు. ఆ దిశగా అంతా ముందుకు సాగాలి.



విశాఖపట్నం కేంద్ర బిందువు

రాజకీయాల్లో విశాఖపట్నం కేంద్ర బిందువుగా మారింది. తొలి నుంచీ ఉత్తరాంధ్ర సాహిత్య, సాంస్కృతిక పునర్వికాసంలో అగ్రభాగాన నిలబడి ఉంది. తెలుగు భాషను కాపాడటంలో, చైతన్యాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించింది. ప్రకృతి సంపదలకే ఉత్తరాంధ్ర నిలయం. గురజాడ అప్పారావు, శ్రీశ్రీ ఇదే గడ్డపై పుట్టి ప్రజలు, శ్రమ జీవుల తరపున కవిత్వం ఝుళిపించారు. మహాప్రస్థానం ఒక దేశభక్తి సముదాయం. నేడు జనగళం, సాహితీ స్రవంతి వంటి సంస్థలు శ్రామిక ఉత్సవాలను ప్రజా సంస్కృతిని పెంపొందించడానికి చేపడుతున్నాయి. దేశమంటే మనుషులోయ్ అని, సొంతలాభం కొంత మానుకొని పొరుగువాడికి తోడ్పడాలని గురజాడ చెప్పారు తప్ప విశాఖ ఉక్కును, కొండలను, భూములను ప్రైవేట్ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టాలని ప్రభుత్వాలకు ఎవ్వరూ చెప్పలేదు. దేశంలో ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల స్పేస్‌ను కబ్జా చేసే విధానాలు మారడం లేదు. అందుకే ఉద్యమాలను నిలబెట్టే విశాఖ ఉత్సవ్ వంటి కార్యక్రమం ఇక్కడ చేపడుతుండడం గొప్ప విషయం.

ఆకట్టుకుంటూ... ఆలోచింపజేస్తూ

కొనసాగుతున్న సైన్స్ ఎగ్జిబిషన్
అధిక సంఖ్యలో తరలివస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా ఎయు కన్వెన్షన్ హాల్ వెనుకగల ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ సైన్స్‌తోనే మానవ మనుగడ అంటూ ప్రజలను ఆకట్టుకుంటూ, ఆలోచింపజేస్తూ ఆదరణ చూరగొంటోంది. ఈ నెల 27న ప్రారంభించిన ఈ ఎగ్జిబిషన్‌కు ప్రతిరోజూ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున తరలి వచ్చి తిలకిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ అంశాలు వారిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సైన్స్ లేనిదే సమాజం ప్రగతి లేదు. మానవుడు తన చుట్టూ ఉన్న భౌతిక జీవ వాతావరణ నిశితంగా పరిశీలించడం, పరిశీలించిన అంశాల మధ్య అర్థవంతమైన సంబంధాలను ఏర్పరచడం ద్వారా, ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కావాల్సిన భావనలను రూపొందించుకున్నాడు. ఈ మానవ ప్రయత్నమే విజ్ఞాన శాస్త్రానికి దారితీసింది. ప్రకృతిలోని రహస్యాలు తెలుసుకోవడం కోసం ఎందరో శాస్త్రజ్ఞులు నిర్విరామంగా కృషి చేసి మనకు ఈ విజ్ఞాన శాస్త్రాన్ని అందించిన సంగతి తెలిసిందే. సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ, ఆరోగ్య, రవాణా రంగాలన్నింటిలో ప్రతిభావంతమైన మార్పులు శాస్త్రీయ విజ్ఞాన అభివృద్ధి ద్వారా జరుగుతున్నవే. సైన్స్ సాధించిన అనేక విజయాల గురించి చెప్పాలంటే, కంప్యూటర్, పొలిటికల్ సైన్స్, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్‌తో పాటు, అంతరిక్షంలోకి మానవుడు ప్రవేశించే సైన్స్ గురించి చెప్పుకోక తప్పదు.

మత చాందస భావాలను చిన్నతనం నుంచి ప్రేరేపించి, తద్వారా లబ్ధి పొందాలని ఆశిస్తున్న రాజకీయ నాయకుల కుళ్లు, కుతంత్రాలు వాస్తవం కాదని, సైన్స్ ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని రుజువు చేసేలా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు ఏర్పాటు చేసిన అంశాలను చూస్తే మనకు తెలుస్తోంది. కంచరపాలెం, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులతో పాటు తగరపువలస ఎన్‌ఆర్‌ఐ, గాయత్రి విద్యా పరిషత్ (జివిపి) మెడికల్ కాలేజీల విద్యార్థులు వివిధ అంశాలపై సైన్సు ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ప్రత్యేక ఏర్పాటుతో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సైన్స్ ప్రాముఖ్యతను గుర్తెరిగేలా చక్కటి కార్యక్రమం ఏర్పాటు చేసింది.

జన విజ్ఞానం వేదిక ఏర్పాటు చేసిన కార్యక్రమం ఐక్యత, సమైక్యత. ప్రస్తుత సమాజంలో ఐక్యత,సమైక్యత ప్రాధాన్యత ఎంతో ఉందని తెలియజెప్పేలాఒక యూనిట్ ఏర్పాటు చేశారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఇది ఒక హైలెట్ గా చెప్పుకోవచ్చు. సిఐటియు 18వ జాతీయ మహాసభలను గుర్తు చేస్తూ, ఒక్కొక్క మహాసభ వివరం తెలుపుతూ 18 మహాసభల పత్రాలను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంలో ఒక చిన్న సర్క్యులర్ రైలు (బ్యాటరీతో నడిచే) ఏర్పాటు చేసిన తీరు అద్భుతంగా ఉంది.

ఇక ప్రింటింగ్ రంగంలో రోజు రోజుకు నూతన పోకడలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో వస్తున్న 3 డి ప్రింటింగ్ ఒకటి. కొంతమందికి మాత్రమే దీని గురించి తెలిసినప్పటికీ, 3డి ప్రింటింగ్ మిషన్ ఏ విధంగా పనిచేస్తుందో అవగాహన కలిగించే కార్యక్రమాన్ని పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ఏర్పాటు చేశారు. పెట్రోల్, డీజిల్ వినియోగం వచ్చే కాలుష్యం మానవాళికి హానికరం. దీనికి ప్రత్యామ్నాయం ఉందని నిరూపించేలా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ఏర్పాటు చేసిన కన్పర్సెన్ ఎనర్జీ యూనిట్ ప్రాజెక్టు రుజువు చేస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మోడల్ పనితీరును తిలకించడానికి వచ్చిన వారికి విద్యార్థులకు ఎంతో చక్కగా, అర్థమయ్యేలా వివరిస్తున్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విద్యుత్తు జనరేషన్ (ఉత్పత్తి) నుంచి మనం వాడుకునే వరకు జరిగే వివిధ పరిణామక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ఆసక్తికరంగా ఉంది. సోలార్ విద్యుత్తు అవసరం గురించి చెబుతూ, దాన్ని ఎలా పొందవచ్చో వివరిస్తున్నారు.

గాయత్రీ పరిషత్ (జివిపి) మెడికల్ కాలేజీ విద్యార్థులు మానవ శరీరంలో వివిధ భాగాలు ఏ విధంగా పనిచేస్తాయనే ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ, మెదడు, శరీరంలోని వివిధ భాగాల పనితీరును ఈ యూనిట్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థులకు వివరిస్తున్నారు. ఇదే సందర్భంగా విశాఖ వంటి నగర ప్రాంతంలో అధికంగా ఉన్న అధిక బరువుతో మనిషి ఎదుర్కొనే ఆరోగ్య ఇబ్బందులు గురించి, ఈ సమస్యను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నారు. పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి కూడా చెప్పడం విశేషం. ఇక దోమల వల్ల కలిగే నష్టాలు, ముఖ్యంగా డెంగీ వంటి ప్రమాదకరమైన జ్వరం గురించి వివరిస్తూ, ఈ జ్వరం ఎందుకు వస్తుంది, అది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరిస్తున్నారు.

తగరపువలస ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కాలేజీ విద్యార్థులు గుండె జబ్బులు అధికంగా రావడానికి గల కారణాలు గురించి వివరించే ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. షుగర్ వ్యాధి రాకుండా, వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. గుండె జబ్బులు రావడానికి ముఖ్య కారణం ఆల్కహాల్, స్మోకింగ్ వంటివి ప్రమాదకరమని, వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. నిత్యం వ్యాయామం చేయాల్సిన అవసరం గురించి వివరిస్తూ, పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వివిధ చార్టులను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా బిపి, బరువు తెలుసుకునే యూనిట్ ఏర్పాటు చేశారు. ఇది కూడా బాగా ఆకట్టుకుంది. ఇవే కాకుండా మరెన్నో ఆసక్తికరమైన సైన్స్ యూనిట్లు ఇక్కడ ఏర్పాటు చేయటం విశేషం. ఇంత చక్కటి సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కారణమైన సిఐటియు 18వ మహాసభలు విజయవంతం కావాలని ఆశిద్దాం.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న ఓ నమూనా

సైన్స్ ఎగ్జిబిషన్‌కు పోటెత్తిన విద్యార్థులు, నగర వాసులు

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
మంగళవారం 30 డిసెంబర్ 2025

కోలాటం ప్రదర్శిస్తున్న విశాఖ మహిళా కళాకారులు

సాగర తీరాన.. కార్మిక పండగ

శ్రామిక ఉత్సవ్‌కు విశేష స్పందన
మూడో రోజూ సందడిగా కళా, విజ్ఞాన, సాంస్కృతిక వేదికలు

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సన్నద్ధంగా సాగర తీరంలో తలపెట్టిన 'శ్రామిక ఉత్సవ్' పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ నెల 27న ప్రారంభమైన ఈ ఉత్సవ్ ప్రాంగణం ప్రజానీకం ఉత్తేజ, ఉత్సాహ దోలికలతో కొత్త సందడిని సంతరించుకుంటోంది. మూడో రోజు సోమవారం సాయంత్రం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అధ్యక్షతన 'స్త్రీ పురుష సమానత్వం' థీమ్‌తో జరిగిన సభకు ముఖ్య అతిథిగా కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ హాజరై అభ్యుదయ, విప్లవకర సినిమా పాటలతో అలరించారు. శ్రామిక సంస్కృతిని తెలియజెప్పారు. సభకు ముందు ఆయన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోగల బుక్‌స్టాల్స్ అన్నీ కలియతిరిగారు. సభికులందరినీ ఏకరీతిన ఆనందోత్సాహంలో ముంచెత్తుతూ మరో విశిష్ట అతిథి జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ పుస్తక మహోత్సవ స్టాల్స్‌ను సందర్శించారు. సైన్స్, ఫొటో ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి.

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

బాల కళాకారులకు ప్రసంశాపత్రాలు అందజేస్తున్న సుద్దాల అశోక్‌తేజ, చిత్రంలో నర్సింగరావు, రమాదేవి

ఆకట్టుకున్న విభిన్న కళారూపాలు

ప్రజాశక్తి - భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో విశాఖ ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు మూడో రోజు అదే ఉత్సాహంతో కొనసాగుతున్నాయి. కవి యాదగిరి రాసిన "ఆటాడుకుందాం.. పాట పాడుకుందాం... అందరం కూడా మాట్లాడుకుందాం.. అన్న ఆనాటి రోజులను గుర్తు చేస్తూ 'ఆటలన్నీ పోయే, మాటలన్నీ కనుమరుగాయే' పాటను పాడుతూ ఆకట్టుకున్నారు. ఇంటింటా ఇంటర్నెట్, చేతిలో సెల్ ఫోన్, ఇంట్లో టీవీ, జన బాహుల్యంలోకి రావడంతో విదేశీ సంస్కృతి జడలు విప్పుతున్న వైనాన్ని పాట రూపంలో కళాకారులు వివరించారు.

నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే, ప్రభుత్వాసుపత్రులు, విద్య ప్రైవేటీకరణ అవుతున్న నేపథ్యాన్ని వివరిస్తూ పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ఎండగడుతూ.. 'ప్రతిదీ ప్రైవేటు రా... ప్రజలపైన వేటు రా .. దేశానికి చేటు రా' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు అనిల్ పాడిన పాట సభికులను ఆలోచింపజేసింది. మన డబ్బుతో నిర్మించిన ఫ్యాక్టరీలు బహుళ జాతి సంస్థలకు పాలకులు ఎలా కట్టబెడుతోందోకళాకారుల పాట రూపంలో వివరించారు.

అరకు, పద్మాపురం గ్రామాలకు చెందిన గిరిజన మహిళలు, పురుషులు ప్రదర్శించిన "థింసా నృత్యం" గిరిజనుల ఐక్యతను చాటేలా ఉంది. లయబద్ధంగా గిరిజన డప్పు కళాకారుల వాయిద్యం, థింసా నృత్యం సభికులను కట్టి పడేసింది. మతాలు వేరైనా మనమంతా ఒక్కటిగా నిలవాలన్న సందేశాన్ని ఇచ్చే 'ఆత్మలను పలికించేదే అసలైన భాష, ఆ విలువ కరువైపోతే అది కంఠశోష" అన్న పాటను ప్రజానాట్య మండలి రాష్ట్ర కళాకారులు ఆలపించారు.

పూలే, సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళలకు చదువు ప్రాధాన్యత తెలుపుతూ రాజేశ్వరి బృందం ఆధ్వర్యంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చిన్నారులు ప్రదర్శించిన 'మన జీవితాల్లో వెలుగులు నింపెను, వెలుగుల రాదారి" నృత్యం సభికులను ఆలోచింప జేసింది. 'ఈ దేశపు తొలి పంతులమ్మగా చేరి, మన జీవితాల్లో నింపెను వెలుగులు' అన్న పాట ఆకట్టుకుంది.

'సంపద సృష్టికి మూలం, చెమట చుక్కలే' అంటూ ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఐవి పాడిన గేయం కష్ట జీవులు, కార్మికుల శ్రమను గుర్తుచేసింది. అలాగే 'సుత్తీ, కొడవలి అందుకో' చెమట చుక్కలా ఎర్ర జెండా' అంటూ ఆయన ఆలపించిన గేయం ఎర్ర జెండా ప్రాధాన్యత, విశిష్టత ను తెలిపింది.

'దేశమంటే మట్టి కాదోయ్'... 'దేశమంటే మనుషులోయ్'

అన్న గురజాడ మాటలను ప్రస్తావిస్తూ గురజాడ గొప్ప తనాన్ని, తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ ఏలూరు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు.

'ఘనమైన చరితే నీది ఎర్ర జెండా'
'నీకుంది పేద ప్రజల అండ దండ'

అంటూ ఎర్ర జెండా ప్రాధాన్యతను తెలుపుతూ ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకులు జగన్ ఆధ్వర్యంలో కళాకారులు పాడిన గేయం సభికులను ఉత్సాహ పరిచింది.

కేరళ మాజీ మంత్రి టిపి.రామకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న నర్సింగరావు తదితరులు

కరీంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సుద్దాల అశోక్‌తేజకు అపూర్వ స్వాగతం

మాట్లాడుతున్న అశోక్ తేజ

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కరీం, రామకృష్ణన్ తదితరులు

ఆకట్టుకున్న కళారూపాలు

గురజాడ స్ఫూర్తి గీతానికి కళాకారుల నృత్య ప్రదర్శన

కేరళ కళాకారుల సంప్రదాయ నృత్యం

అల్లూరి సీతారామరాజు నాటికలోని ఓ సన్నివేశం

పుస్తకం జ్ఞాన శిఖరం : సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

సిఐటియు 18వ జాతీయ మహాసభల సందర్భంగా విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవం మూడో రోజు అత్యంత ఉత్సాహభరితంగా సాగింది ఈ ప్రదర్శనను సోమవారం సాయంత్రం ప్రముఖ సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ వీక్షించారు. పుస్తక ప్రదర్శనలోని వివిధ స్టాల్స్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పుస్తకం గొప్పతనాన్ని కొనియాడారు. మానవ పరిణామ క్రమంలో పుస్తకం ఒక గొప్ప ఆయుధం. అది కేవలం అక్షరాల సమాహారం కాదు, తరతరాల అనుభవాన్ని, జ్ఞానాన్ని అందించే మార్గదర్శి అని పేర్కొన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవడానికి, అన్యాయాలను ఎదిరించడానికి పఠనాసక్తి ఎంతో అవసరమని సూచించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన అరుదైన గ్రంథాలను, చారిత్రక, రాజకీయ విశ్లేషణలతో కూడిన ప్రత్యేక పుస్తకాలను సుద్దాల ఆసక్తిగా వీక్షించారు. కొన్ని పుస్తకాల పూర్వపరాలను, వాటి విశిష్టతను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుస్తక మహోత్సవాలు ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఆలోచనా దృక్పథాన్ని పెంపొందిస్తాయని ప్రశంసించారు.

నిర్వాహకులకు అభినందనలు

సిఐటియు మహాసభల నేపథ్యంలో కేవలం రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా, విజ్ఞానాన్ని పంచే పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అశోక్‌తేజ అభినందించారు. ఈ ప్రదర్శనకు వస్తున్న విశేష స్పందన పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. సుద్దాల అశోక్ తేజ రాకతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన రచయితను చూడడానికి, ఆయనతో ఫోటోలు దిగడానికి సందర్శకులు పోటీ పడ్డారు. ప్రతి ఒక్కర్నీ చిరునవ్వుతో పలకరిస్తూ, ఆప్యాయంగా వారితో ఫోటోలు దిగి అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రతినిధులు, పుస్తక ప్రేమికులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

'శ్రామిక ఉత్సవ్'ను సందర్శించిన జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి ఎంవిపి కాలనీ

ఈనెల 31 - జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలు సందర్భంగా ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన 'శ్రామిక ఉత్సవాల'ను జివిఎంసి కమిషనర్ పి.కేతన్‌గార్గ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా 'బాల్య వివాహాలను నిర్మూలిద్దాం' అన్న అంశంపై ప్రదర్శించిన లఘుచిత్రాన్ని ఆయన వీక్షించారు. సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి చిత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. అలాగే చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సైన్స్, ఫోటో,కార్టూన్ ప్రదర్శనలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఫోటో ఎగ్జిబిషన్ చరిత్రకు అద్దం పట్టేలా ఉందని కొనియాడారు. పుస్తక ప్రదర్శనను సందర్శించిన ఆయన ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. చివరిగా సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉన్నాయని, ఈ మహాసభలు, అనుబంధ కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరుకుంటున్నానని అన్నారు.

ఉత్సవ్ ప్రాంగణంలో కళాకారులు

జివిఎంసి కమిషనర్‌తో కరీం, టిపి.రామకృష్ణన్ మాటామంతీ

మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ, చిత్రంలో రాంభూపాల్, హరికిషోర్, మధు, రాజేష్‌రెడ్డి

పోరాటాల రంగం... సిఐటియు సంఘం

విజయనగరంలో కార్మికులు చేపట్టిన భారీ ర్యాలీ

సమస్యలపై ఎన్నో ఆందోళనలు
నిర్బంధాలను ఎదుర్కొంటూ.. నిర్భయంగా ముందుకు సాగుతూ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కార్మికులకు అండగా... శ్రమజీవులకు శక్తిగా... చిరుద్యోగుల గుండె చప్పుడుగా అనేక పోరాటాలు, ఎన్నో విజయాలు, మరెన్నో ప్రగతిశీల లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సిఐటియు మరో అడుగు ముందుకు వేస్తోంది. ఓవైపు పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తుల శ్రమదోపిడీ, ఉద్యోగులపై వేధింపులు పెరుగుతుండగా, మరోవైపు ఎర్రజెండా నీడలో సిఐటియు ఆధ్వర్యాన విజయనగరం జిల్లాలో పోరాటాలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. పోరాటాల ద్వారా ఎన్నో కార్మికులు ఎన్నో సమస్యలను పరిష్కరించుకున్నారు. ఇటువంటి సందర్భంలో సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు పక్కనే ఉన్న విశాఖ జిల్లా వేదికైంది. బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 31 నుంచి జనవరి 4వరకు జరగనున్నాయి. ఈ మహాసభల నేపథ్యంలో విజయనగరం జిల్లాలో సిఐటియు చేసిన పోరాటాలు, విజయాలను కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు.

విజయనగరం జిల్లాలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు, హక్కులను పరిరక్షించుకునేందుకు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. మరిన్ని సమస్యలు పరిష్కరించుకుని యాజమాన్యాల మెడలు వంచారు. కొన్ని దశాబ్దాలుగా జిల్లాలో ప్రధానమైన జ్యూట్, ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడడం వల్ల జిల్లా పారిశ్రామికంగా మరింత వెనుకబడిన విషయం విధితమే. ఈస్ట్‌కోస్ట్, అరుణా, బొబ్బిలి గోపాలకృష్ణ, జ్యోతి జ్యూట్ మిల్లులు మరికొన్ని పరిశ్రమల స్థలాలు రియల్ ఎస్టేట్‌గా మారిపోయాయి. దీంతో పారిశ్రామిక రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20వేలమంది కార్మికులు శాశ్వతంగా ఉపాధికి దూరమయ్యారు. ఈ ప్రభావం విజయనగరం, గరివిడి, కొత్తవలస, బొబ్బిలి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పారిశ్రామిక సంక్షోభాన్ని అధిగమించి జిల్లాలో నిలదొక్కుకుంటున్న మైలాన్, హెబిఎల్, సిపి ఆక్వా, ఎస్ఎంఎస్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలతో పాటు హేచరీస్, పౌల్ట్రీస్ తదితర పరిశ్రమల్లో కార్మికులు రకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వమే ఇసుక వ్యాపారం మొదలెట్టిన తర్వాత నిర్మాణ రంగ కార్మికులు చాలా వరకు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రంగం ఈ రంగం కాదు. అన్ని రంగాల్లోనూ కార్మికులు ఇబ్బందులు పడుతు న్నారు. మరోవైపు రెండో ఎఎన్ఎం, విఆర్ఎలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు సమస్యలైతే అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత లేదు. పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. బండెడు చాకిరీ మోస్తున్నా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థి తుల్లో వీరికి సిఐటియు అండగా నిలుస్తూ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోంది.

గర్భాం ఆంధ్రా ఫెర్రో కార్మికులు చేపట్టిన ఆకలియాత్ర (ఫైల్)

తలపెట్టిన పోరాటాలు.. సాధించిన విజయాలు

- మైలాన్‌లో 2020లో కాంట్రాక్టు వర్కర్స్‌కు జరిగిన వేతన ఒప్పందంలో ఒక్కొక్క కార్మికునికి రోజుకు రూ.72 వేతనం పెరిగింది.
- మైలాన్‌లో ఆపరేటర్లు 2021లో జరిగిన వేతన ఒప్పందంలో భాగంగా ఒక్కొక్క కార్మికునికి నెలకు రూ.8వేలు వేతనం పెరిగింది.
- భోగాపురం శ్రీనివాస హేచరీస్‌లో 2021 లో వేతన ఒప్పందం జరిగింది. ఈ సందర్భం గా ఒక్కొక్క కార్మికునికి నెలకు రూ.2,500 నుంచి రూ.3వేల వరకు పెరిగింది.
- గరివిడి మైన్స్‌లో 2020లో జరిగిన వేతన ఒప్పందం ద్వారా ఒక్కొక్క కార్మికునికి రోజు రూ.600 వేతన ఒప్పందం జరిగింది. 58 రోజులు వేతనాన్ని గ్రాట్యూటీగా సాధించుకున్నారు.
- విజయనగరంలోని చందనా బ్రదర్స్ కోవిడ్ కాలంలో మూసివేయగా, మూడునెలల పాటు పోరాటం సాగింది. కార్మికులకు శాశ్వత సెటిల్‌మెంట్ జరిగింది. ఒక్కొక్క కార్మికుడు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల సాధించుకున్నారు.
- 2023లో అంగన్వాడీలు 42రోజుల సమ్మె కాలంలో విజయనగరం జిల్లాలో 13చోట్ల శిబిరాలు నడిచాయి. ధర్నాలు, రాస్తారోకో వంటి ఆందోళనలు చేపట్టారు. మంత్రుల ఇళ్లముట్టడి కార్యక్రమాలకు కూడా వెనుకాడలేదు. ఫలితంగా 60ఏళ్ల రిటైర్‌మెంట్ వయసును ప్రభుత్వం 62ఏళ్లకు పెంచారు. ఉద్యోగ విరమణ సందర్భంగా వర్కర్లు రూ.1.50లక్షలు, ఆయాలకు రూ.50వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రకటించింది. మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు వర్కర్లకు ప్రమోషన్ కల్పించేందుకు ప్రభుత్వం దిగివచ్చింది.
- ఈ ఏడాది గజపతినగరం మండలం రామన్నపేటలోని అంగన్‌వాడీ వర్కర్‌ను రాజకీయ కక్షసాధింపులతో తొలగింపునకు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి అధికార యంత్రాంగం దిగిరాక తప్ప లేదు.
- ఈ ఏడాది ఆశా వర్కర్లు సిఐటియు అండతో వివిధ సమస్యలపై డిఎం అండ్ హెచ్ఒ, కలెక్టర్ ఆఫీస్ వద్ద 6 గంటల పాటు వంటా, వార్పు కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టారు. ఈ క్రమంలో ఆశా కార్యకర్తలు మెటర్నటరీ వేతనంతో కూడిన సెలవుతోపాటు అనేక సమస్యలను పరిష్కరించుకున్నారు.
- 2024లో నెల్లిమర్ల మిమ్స్ కార్మికులు తొలగింపు, బకాయి డిఎలు, పని ఒత్తిడి తగ్గించాలని 2 నెలలకు పైగా సమ్మె జరిగింది. తొలుత మొండిగా వ్యవహరించిన యాజమాన్యం, ప్రభుత్వ జోక్యంతో దిగరాక తప్పలేదు. 23 మందిపై అక్రమ కేసులు పెట్టి 13 రోజుల పాటు సెంట్రల్‌జైలు, సబ్‌జైల్లో పెట్టారు. చివరకు రాష్ట్ర నాయకత్వం సహకారంతో లేబర్ ఆఫీస్‌లో ఒప్పందం కుదిరింది. నూతన వేతన ఒప్పందం చేశారు.
- ఈ ఏడాది గరివిడి మండలం దేవాడ మైన్స్ లీజు ఒప్పందం పూర్తయిన నేపథ్యంలో స్థానిక కార్మికుల తొలగింపు చర్యలు సిఐటియు పోరాటంతో ఆగాయి.
- రామభద్రపురం, ఎస్.కోట, పురిటిపెంట, గజపతినగరం, ఎల్.కోట, గరివిడి మేజర్ పంచాయతీల్లో జీతాలు పెంచాలని, బకాయి జీతాలు చెల్లించాలని 4 రోజుల నుంచి 26 రోజుల వరకు వివిధ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ల సమ్మె శిబిరాలు జరిగాయి.
- ప్రమోషన్లు ఇవ్వాలని సచివాలయ ఎఎన్ఎంలు కొంతకాలంగా పోరాడి విజయం సాధించారు. ఫలితంగా 156 మంది ప్రమోషన్లు పొందారు.

కవులే శ్రామికోద్యమ నిర్మాతలు

- జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం కీలకపాత్ర
- ఎయు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వెలమల సిమ్మన్న

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

కవులు, రచయితలు శ్రామికోద్యమానికి నిర్మాతలు కావాలని ఆంధ్రాయూనివర్శిటీ తెలుగు విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వెలమల సిమ్మన్న ఆకాంక్షించారు. ప్రభుత్వ విధానాల వల్ల నేడు కార్మికవర్గం తీవ్ర ఒత్తిడి, శ్రమదోపిడీ ఎదుర్కొంటుందని, భవిష్యత్తులో మరింత నిర్బంధ చర్యలు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నాటి జాతీయోద్యమ స్ఫూర్తితోనే కార్మికోద్యమానికి సన్నద్ధం కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ జరుగుతున్న శ్రామిక సాహితీవేదికపై 'జాతీయోధ్యమంలో తెలుగు సాహిత్యం' అన్న అంశంపై సాహితీ స్రవంతి శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షతన సభలో ఆయన మాట్లాడారు. జాతీయోద్యమంలో తెలుగునాట కవులు, రచయితలు, కళాకారులు కీలకపాత్ర పోషించారంటూ చరిత్రను విరించారు. నాడు కవులు కుల, మతాలకతీతంగా ప్రజలను ఐక్యంచేసి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు కృషి చేస్తే, నేటి పాలకులు మతాల మధ్య చిచ్చుపెడుతూ ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా కార్మికుల ఐక్యతను దెబ్బతీయడం ద్వారా వారిపై భారాలు మోపడం, భద్రత లేకుండా చేయడం, శ్రమను దోచుకోవడం వంటివాటికి పాల్పడుతున్నారని వివరించారు. ఇటువంటి తరుణంలో 'స్వాతంత్ర్యం వచ్చెనని సంబర పడగానే సరిపోదోయి... సాధించిన దానికి సంతృప్తిని పొంది, అదే విజయమనుకుంటే పొరపాటోయి' అంటూ శ్రీశ్రీ రాసిన గేయాన్ని నేటి కవులంతా స్ఫూర్తిగా తీసుకుని ముందుకు తీసుకెళ్లాని పిలుపునిచ్చారు. కవి, తెలుగు పండితులు బాడాన శ్యామలరావు మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అన్ని కీలక సందర్భాల్లో తెలుగు కవులు, రచయితలో ప్రజల్ని చైతన్యపర్చారని అన్నారు. కవులు రగిలించిన ఉద్యమ స్ఫూర్తితో స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణాలర్పించేందుకు వెనక్కితగ్గలేదన్నారు. నేడు పాలకులు మోపుతున్న కష్టనష్టాలపై కవితలు రాస్తే తట్టుకోలేకపోతున్నారని, ఫలితంగా శ్రామికుల సమస్యలు మరుగునపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ నేతరం కవులు జాతీయోద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. 'మాకొద్దీ తెల్లదొరతనం' అంటూ కవి గరిమెళ్ల సత్యనారాయణ బ్రిటీష్ పాలకులపై గర్జించిన తీరును అర్థం చేసుకుని ముందుసాగాల్సిన అవసరం ఉందన్నారు. డివి సూర్యారావు మాట్లాడుతూ గురజాడ మొదలుకుని ఎంతో మంది కవులు దేశభక్తి భావాలను రగిలించి, స్వాతంత్రోద్యమం కోసం పరితపిస్తే నేటి పాలకులు ఆ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని అన్నారు. జాతిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో కవులు, రచయితలు మరోసారి సమయాత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. బద్రి కూర్మారావు మాట్లాడుతూ శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం, మందస జమిందారీపోరాటం, నైజాం వ్యతిరేకోద్యమాల్లో కూడా తెలుగు సాహిత్యం కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. సభాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ గురజాడ, కందుకూరి, శ్రీశ్రీ, ఉన్నవల లక్ష్మీనారాయణ వంటి కవులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా నేటి సమాజంలో శ్రామికవర్గంపై జరుగుతున్న దాడితో పాటు విచ్ఛిన్నకర శక్తుల కుట్రను కవితులు, రచనల ద్వారా బయటపెట్టి, ప్రజల్ని అప్రమత్తం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న డాక్టర్ సిమ్మన్న

కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శి పెంటకోట రామారావు, నాయకులు చలపతిరావు పాల్గొన్నారు. సభలో ప్రసంగించిన కవులందరికీ సాహితీ స్రవంతి నాయుల చేతులమీదుగా శ్రమ అవార్డులు ప్రదానం చేశారు.

నాట్య బృందం

నాట్య బృందం గిన్నిస్ రికార్డు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి చెందిన కూచిపూడి నాట్య నృత్య కళాకారిణి, నాట్యశ్రీ నృత్య కళానికేతన్ దర్శకులు కూన శ్రీలత తన నృత్య విద్యార్థులతో కలిసి ఇటీవల హైదరాబాద్ వేదికగా గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించింది. కూచిపూడి కళా వైభవం పేరిట హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 7209 మంది నృత్య విద్యార్థులతో కలిసి పాల్గొని ఈ ఘనత సాధించారు. రికార్డు సాధించిన వారిలో ఆమదాలవలస శ్రీకాకుళం పట్టణాలకు చెందిన స్వాతి, చరిష్మా, లాస్య, ప్రియ, శ్రీవల్లి, ఝాన్సీరాణి, సహస్ర, మేఘన, తన్మయి, ప్రత్యూష, హర్షిత, రాజేశ్వరి, యోక్షిత, వర్షిని, హనీషా, కార్తీక, మాన్య, దేవాన్షిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలత నాట్య గురువు, కళారత్న చింతా రవి, బాలకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.


ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

43 మందికి ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాతపట్నం నియోజకవర్గం టిడిపి కేంద్ర కార్యాలయంలో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసిన 43 మంది కార్యకర్తలకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపికి కార్యకర్తలే బలమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

బూర్జ : పాలకొండ పట్టణంలోని శ్రీవిజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యాన మంగళవారం మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలోని భూమిక గిరిజన గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దూబా పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచితంగా బిపి, సుగర్, పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ వంటి అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజం దిశగా...

ప్రజాశక్తి- మందస

మందస : మాట్లాడుతున్న శివాజీ

పోలీస్ వ్యవస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభ్యుదయం సైకిల్‌యాత్ర ర్యాలీ సోమవారం మందస మండలం హరిపురం చేరుకుంది. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా యువతలో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా సాగుతున్న ఈ యాత్రలో మాజీ మంత్రి గౌతు శివాజీ పాల్గొని మాట్లాడారు. సమాజ హితం కోసం పోలీసులు పడుతున్న శ్రమను కొనియాడారు. జీవితం అమూల్యమైనదని, డ్రగ్స్ అనే మహమ్మారి వల్ల విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను చిన్నాభిన్నం చేసుకోవద్దని హితవు పలికారు. యువత చదువు, క్రీడలు, కెరీర్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన, రాష్ట్ర బిసి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావు, పలాస డిఎస్‌పి, సిఐ, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సోంపేట : డ్రగ్స్ వద్దు బ్రో అంటూ పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర మండలంలోని మామిడిపల్లికి చేరుకుంది. స్థానిక సిఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబునాయుడు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున ర్యాలీకి స్వాగతం పలికారు. డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డ్రగ్స్ వద్దు అంటూ రాజాం కస్తూరిబా పాఠశాల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

పవర్ స్కిల్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక స్వర్ణభారతి డిగ్రీ కళాశాలలో కెరియర్ ఛాయిస్ పైన పవర్ స్కిల్స్ అనే వర్క్ షాప్ నిర్వహించారు. ఇందులో ప్రతినిధులు కిరణ్, గౌతమి, సోషల్ వెల్ఫేర్ శరత్ పాల్గొని విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ తరువాత విలువైన సూచనలను ఇచ్చి కమ్యూనికేషన్ స్కిల్స్ బాగుంటే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి అని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు సాగాలని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రాము, కో-ఆర్డినేటర్ మహేశ్వరి, ప్రిన్సిపాళ్లు సందీప్, జయప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను అందిస్తున్న ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీలకు 23 మంది ఎంపిక

పతకాలు సాధించిన విద్యార్థులు

కోటబొమ్మాళి: ఈనెల 14న రెండోవ ఇంటర్ స్కూల్ పెన్‌కాక్ సిలాట్ పోటీలకు గౌతమ్ మార్షలార్ట్స్ విద్యార్థులు 60 మంది పాల్గొనగా, రాష్ట్రస్థాయికి 23 మంది ఎంపికైనట్లు కోచ్ గౌతమ్ కుమార్ తెలిపారు. అయితే ప్రత్యార్థులకు గట్టిపోటీ ఇచ్చారని అన్నారు. ఉత్తమ ప్రతిభకలిగిన విద్యార్థులకు జనవరి 29న ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగే అల్ ఇండియా పెన్‌కాక్ సిలాట్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. రెండువ రాష్ట్ర లెవల్ ఇంటర్ స్కూల్ పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో కోటబొమ్మాళికి చెందిన అట్ల జస్విన్, అట్ల కార్తికేయలు రెండు స్వర్ణం, రెండు రజతం సాధించగా, ఉప్పరపేటకు చెందిన చెన్నంచెట్టి శివబాలాజీ, చెన్నచెట్టి దీపికలు రెండు స్వర్ణం, రజితం పతకాలు గెలుచుకున్నట్లు కోచ్ గౌతమ్ తెలిపారు.

ప్రకృతి సేద్యం పెరగాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ప్రకృతి వ్యవసాయ సాగు పెరగాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు వివరాలను తప్పకుండా నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సాగు ఉత్పత్తులకు నిర్దిష్టమైన బ్రాండ్‌ను తీసుకొచ్చేవిధంగా మార్కెటింగ్ నైపుణ్యం సిబ్బంది కలిగి ఉండాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని పూర్తిగా రైతులతో చేయడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. సీడ్ టు సీడ్ రైతులుగా మారడానికి సిబ్బంది పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారులు ప్రకాష్, హేమసుందర్, అడిషనల్ డిపిఎం ధనుంజయ్ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న సత్యనారాయణ

సాదాసీదాగా మండల సమావేశం

మాట్లాడుతున్న ఎంపిపి ఉషారాణి

ప్రజాశక్తి- పొందూరు

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన సోమవారం మండల ప్రత్యేక బడ్జెట్, సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. సందర్భంగా తుంగపేట సర్పంచ్ పప్పల వేణుగోపాలం గతంలో చనిపోయినవారికి సంబంధించిన మరణ ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నానని అన్నారు. వాటిని తహశీల్దార్ కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయానికి పంపించినా వాటిని రిజిస్టర్ చేయకుండా పెండింగ్‌లో ఉంచేస్తున్నారని తెలిపారు. దీనివల్ల రైతులు తమ భూములకు సంబంధించి మ్యుటేషన్ చేసుకోలేకపోతున్నారని తెలిపారు. వివాహాలు, చదువుల నిమిత్తం వాటిని అమ్ముకుందామన్నా కదురడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి మరణ ధ్రువపత్రాలను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లలవలస సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు మాట్లాడుతూ 1బికి ఆధార్‌ను లింకు చేసుకున్నా అన్నదాత సుఖీభవ డబ్బులు ఇంతవరకూ కొంతమంది రైతుల ఖాతాల్లో జమకాలేదని తెలిపారు. అలాగే కనిమెట్ట ఎంపిటిసి మాట్లాడుతూ గ్రామంలో పలుచోట్ల సిసి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరారు. గతంలో నిర్మాణం చేపట్టి మధ్యలో నిలిచిపోయి అంగన్వాడీ భవనాలను పూర్తి చేయాలని కోరారు. తుంగపేటలో బిసి కాలనీలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో రక్షిత తాగునీటి పథకం ట్యాంకును నిర్మించి ఇంటింటా తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు. ఈ సందర్భంగా 2025-26 సవరణ బడ్జెట్‌లో ఆదాయం రూ.35,38,01,628 కాగా, వ్యయం రూ.35,21.71,674గా పొందుపర్చారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి అంచనా ఆదాయం రూ.35,87,51,000లు కాగా, వ్యయం రూ.35,70,73,000లుగా చూపించారు. దీంతో రూ.16,78,000 మిగులుగా పొందుపరిచారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, తహశీల్దార్ ఆర్.వెంకటేష్, పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళి, డిప్యూటీ ఎంపిడిఒ డి.అప్పన్న పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న తహశీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి

లే అవుట్ పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సీతమ్మ ఆలయం వద్ద వేస్తున్న లే అవుట్‌ను తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, కమిషనర్ ఇ.శ్రీనివాసులు అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. సీతమ్మ ఆలయం ప్రాంతంలో వంశదార కాలువను ఆక్రమించి అనధికారికంగా లే అవుట్ వేస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించి లే అవుట్ ప్రాంతాన్ని సర్వేయర్లతో కలిసి పరిశీలించారు. దీనికి సంబంధించి వంశధార కాలువ గట్టు కొలతలు తీయగా గట్టులో సెంటు భూమి లే అవుట్లో కలసినట్లు గుర్తించారు. వంశధార స్థలాన్ని విడిచిపెట్టి లేఅవుట్ వేయాలని మార్కింగ్ ఇవ్వడంతో లే అవుట్ యాజమాని దానికి అంగీకరించారు. అదేవిధంగా సీతమ్మ ఆలయం వద్ద బెంచీలు తొలగించిన యాజమానికి అధికారులు ప్రశ్నించారు. వారం రోజుల్లో వాటిని యథాస్థానంలో ఏర్పాటు చేస్తామని యాజమాని అధికారులకు తెలిపారు. వారితో పాటు టౌన్, మండల సర్వేయర్లు చలపతిరావు, గిరి, టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న జయంతిరావు

అంతర్జాతీయ సదస్సులో జయంతిరావు

ప్రజాశక్తి- నందిగాం

నందిగాంకు చెందిన డాక్టర్ మాదిన జయంతిరావు ఎన్ఐటి రూర్కెలాలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ఎన్సంబల్ లెర్నింగ్ అప్రోచ్ ఫర్ హార్ట్ డిసీజ్ ప్రిడక్షన్ అనే అంశంపై ప్రసంగించారు. మానవుల్లో అకస్మాత్తుగా సంబంధించిన గుండె సంబంధించి వ్యాధులను ముందుగా గుర్తించి నివారణ చర్యలకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నిక్ ద్వారా నివారించవచ్చునని అన్నారు. దీనిపై వివిధ ఉదాహరణలతో తన ఆలోచనలను అంతర్జాతీయ స్థాయిలో ప్రసంగించడం, సదస్సులో ఒక విభాగానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించానని అన్నారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో సుమారు వంద మంది పరిశోధకులు పాల్గొన్నారు. జయంతిరావు ప్రస్తుతం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడంపై నందిగాం మండల పరిషత్ అధ్యక్షులు నడుపూరు శ్రీరామ్మూర్తి అభినందించారు.

అంబేద్కర్ విగ్రహంపై దాడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరంలోని హయాతినగరం సమీపం బాలాజీ నగర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం చేతిని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి సమయంలో విరగ్గొట్టారు. స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ పైడపునాయుడు, వన్ టౌన్ ఎస్ఐ హరికృష్ణలు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అంబేద్కర్స్ ఇండియా మిషన్ నాయకులు ఎఐమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, దళిత సంఘాల జెఎసి నాయకులు డాక్టర్ కంఠ వేణు తదితరులు పరిశీలించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేశారు.

యాత్రికులకు సౌకర్యాలు కల్పించాలి

వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వైకుంఠ ఏకాదశికి వైష్ణవ ఆలయాలకు వచ్చే యాత్రికులకు అసౌకర్యాలు కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులను ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉత్తర ద్వార దర్శనాన్ని సాఫీగా, సులభంగా చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా క్యూలైన్ల పకడ్బందీ నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎక్కడా తోపులాటలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ శాఖలతో పాటు దేవాదాయశాఖ, మున్సిపల్ అధికారులు సహా అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

'పది' విద్యార్థులకు యోగా

ప్రజాశక్తి- టెక్కలి

జాతీయ విద్యా విధానం అమలుల్లో భాగంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు అన్ని పాఠశాలల్లో యోగా సాధన చేయించాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్య అనేది ఆనందదాయకంగా ఉండాలే కానీ బాధాకరంగా ఉండకూడదని భావించింది. ఇందులో భాగంగా కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసి వాటిని పాఠశాలల్లో అమలుజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరింది. రాష్ట్ర విద్యాశాఖ పదో తరగతి ఫలితాలు మెరుగుకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించి వాటిని అమలు చేస్తుంది. ఈ ప్లాన్ అమలు వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి తీవ్రంగా పడింది. ఆదివారమూ తరగతులు, పరీక్షల నిర్వహణ, మార్కులు ఎప్పటికప్పుడు లీప్ యాప్‌లో నమోదు వంటి చర్యలు తీసుకోనున్నారు. యోగా ప్రతి పాఠశాలల్లోనూ అమలుజేసే బాధ్యత ఆయా ప్రధానోపాధ్యాయులపై ఆధారపడి ఉంది.

చెస్ ఆడుతున్న విద్యార్థులు

ఉత్సాహంగా ఓపెన్ చెస్ టోర్నీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నిరంతరం చెస్ సాధనతో మెదడు పదునెక్కుతుందని, తద్వారా చదువులో కూడా రాణించడానికి ఉపయోగపడుతుందని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు దామోదర్ సంజీవయ్య, మెమోరియల్ ట్రస్టు ప్రెసిడెంట్ డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా తెలిపారు. నగరంలోని ఇలిసిపురం ప్రాంతంలో ఉన్న తిలక్నగర్ నర్సరీ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో క్రిస్మస్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని 209వ చెస్ టోర్నీని ఉత్సాహంగా సోమవారం నిర్వహించారు. 5 రౌండ్ల పాటు నిర్వహించిన చెస్ పోటీల్లో చెస్ క్రీడాకారులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతులు అందజేశారు. టోర్నీ విజేతగా తంగి సూర్య, సత్తాచాటగా, ఎ.ప్రసాద్, వి.రోషిణి, కరణం రోహన్, జి.యశ్వంత్‌ప్రతాప్ విజేతలుగా నిలిచారు.

శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా శివ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు కోరుకొండ మల్లేశ్వరరావు సోమవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువ కప్పి సన్మానించారు. నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కెకె నాయకత్వంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

బొకేలకు డిమాండ్

న్యూ ఇయర్‌కు ముందస్తు బుకింగ్

ప్రజాశక్తి- అరసవల్లి

గులాబీలు, లిల్లీలు, తులిప్, జలబర్ ఒంటి పూలతో చేసిన బొకేలను కొనుగోలు చేసి కొత్త సంవత్సరానికి హార్ట్ ఫుల్‌గా వెల్‌కమ్ చెప్పేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. సాధారణంగా పుట్టినరోజు వేడుకలకు, సన్మానాలు సత్కారాలకు శుభాకాంక్షలు చెప్పేందుకు బొకేలు ఇస్తుంటారు. న్యూ ఇయర్స్ గ్రీటింగ్స్ చెప్పేందుకూ ఎక్కువమంది బొకేలపైన ఆసక్తి చూపిస్తారు. అందువల్ల వీటికి మరింత డిమాండ్ పెరిగింది. జిల్లా మొత్తం పూలబొకేల వ్యాపారం రూ.కోటికి పైగా ఉంటుందని అంచనా. నగరంలో పూల వ్యాపారం మూడు పువ్వులు ఆరు దండలు మాదిరిగా సాగుతోంది. నగరంలో 20 మంది పైగా మంది హోల్‌సేల్ పూల వ్యాపారం చేస్తున్నారు. 50కి పైగా రిటైల్ పూల వ్యాపారులూ ఉన్నారు. వీరంతా ఏటా న్యూ ఇయర్ సీజన్‌లో పలు రకాల ఆకర్షణీయమైన డిజైన్లతో బొకేలు తయారు చేసి విక్రయిస్తూ ఉన్నారు. వీరంతా విజయనగరం, సాలూరు, పాచిపెంట, రామభద్రపురం, కడియం ప్రాంతాల నుంచి పూలను తీసుకువచ్చి ఆకర్షణ ఏమైనా బొకేలను తయారు చేస్తూ ఉన్నారు. డిసెంబరు 31, జనవరి 1న ఈ బొకేలకు మంచి గిరాకీ ఉంటుందని వ్యాపారస్తులు తెలిపారు. పెద్ద బజారు, ఏడు రోజు కూడలి, బలగ, అరసవల్లి, జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద హోల్‌సేల్ రిటైల్ పూల వర్తకులు బొకేలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కస్టమర్ల కోరిక మేరకు బొకేలు, దండలు తయారు చేస్తున్నారు. ఏటా సంవత్సరం న్యూ ఇయర్ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు, శుభాకాంక్షలు చెప్పే క్రమంలో పలువురు బొకేలు ఇస్తుంటారు. బొకేలు ధర రూ.వంద నుంచి వెయ్యి వరకు ఉంటుంది. ఇందులో గులాబీలు, బంతి, చామంతి, జలబర్ వంటిపూలను కూడా వాడుతుంటారు. గులాబీ పూలతో తయారుచేసిన దండలు, బొకేలకు ప్రత్యేక డిమాండ్ ఉంది.

ఫిర్యాదు చేస్తున్న ప్రకాష్

దువ్వాడపై ఫిర్యాదు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై ఎస్‌సి, ఎస్‌టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిని నిర్మాత బలగ ప్రకాష్ సిఐ విజయకుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని రఘునాథపురం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్లు 520/1, 520/3లలోని రెండు ఎకరాల స్థలం యజమానినైన తనపైనా, తనభూమిపై తప్పుడు ప్రచారాలు సాగిస్తూ అన్ని విధాలుగా నష్టం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడునైన తాను ఎదగడాన్ని జీర్ణించుకోలేక స్థలం తనకు దక్కలేదన్న అక్కసుతో వివాదాలు సృష్టించి తనను మానసికంగా వేధించడంతో పాటు ఆర్థికంగా నష్టం చేకూర్చేలా చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. టెక్కలికి చెందిన శ్రీనివాస్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకుని దళిత పారిశ్రామిక వేత్తనైన తనకు న్యాయం చేయాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

27 నుంచి కమ్మసిగడాం జాతర

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఉత్తరాంధ్ర ఇలావేల్పు కమ్మ సిగడాం మహాలక్ష్మి తల్లి జాతర వచ్చే నెల 27 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని కమ్మసిగడాంలో మహాలక్ష్మితల్లి కమ్మ వారి కళ్యాణ మండపంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర సక్రమంగా నిర్వహించేందుకు జాతర మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ఎవరు ఏ పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి తేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శులు మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్‌కుమార్, వెలిచేటి మురళీధర్, సిహెచ్.వి.రాజేష్, వెలిచేటి రాయుడు, మన్నె కృష్ణానందం, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, మన్నె తాతియులు, సత్యనారాయణ, బోట్ల రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్‌పికి స్పందనకు 57 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం స్వీకరించే ప్రతి ప్రజా ఫిర్యాదులపై అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, చట్ట పరిధిలో త్వరితగతిన విచారణ చేపట్టి అర్జీదారులు సంతృప్తి చెందేలా న్యాయం చేయాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో 57 ఫిర్యాదులు స్వీకరించించారు. వారి సమస్యలను నేరుగా విని, పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వివరాలను సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్స్, జూమ్ ద్వారా తక్షణమే తెలియజేసి, చట్ట ప్రకారం అవసరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను కాల వ్యవధిలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

కేలండర్‌ను ఆవిష్కిస్తున్న శ్రీరామ్మూర్తి

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

నరసన్నపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో యుటిఎఫ్ కేలండర్‌ను జిల్లా కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఇ.శాంతారావు, పి.దాలినాయుడు, గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజాపు దమయంతి, మండల శాఖ నక్క అప్పయ్య, ఆర్.జగదీశ్వరరావు, భూషణరావు, అప్పలనాయుడు, ఆదినారాయణ, టి.సుధీర్, కృష్ణారావు, తిరుమలరావు, సత్యనారాయణ, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రినాథ్

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ

కవిటి: పకడ్బందీగా పింఛన్లను పంపిణీ చేయాలని ఎంపిడిఒ ఎల్.త్రినాథ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో, సచివాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, పూర్తిస్థాయిలో బాధ్యతతో వ్యవహరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందజేయాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడకుండా మానవీయ దృక్పథంతో పనిచేయాలని అన్నారు. ఐవిఆర్‌ఎస్ కాల్స్ ద్వారా వచ్చే ఫిర్యాదులు, సూచనలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎఒ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ, జిఇఎస్‌డబ్ల్యు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని చిలకపాలెంలో ఉన్న లక్ష్మీనారాయణ ఎంటర్ప్రైజెస్ ఎరువుల షాపును ఎడిఎ రజని, ఎఒ వి.రాజేశ్వరరావుతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, ఎంఆర్‌పి బోర్డును విధిగా ప్రతి డీలరు నిర్వహించాలని సూచించారు. రబీ పంట కాలానికి సుమారు సుమారు 400 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉంటుందని, అందులో 150 టన్నులు రైతు సేవా కేంద్రాల ద్వారా అలాగే, వంద మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. మరొక 80 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలకు ఈ వారంలో సరఫరా చేస్తున్నామని రైతులకు తెలియజేశారు.

పలాస : ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఎవరైనా బ్లాక్ చేస్తే వ్యాపారులపై చర్యలు తప్పవని పలాస వ్యవసాయశాఖ ఎడిఎ ఎం.రామారావు వ్యాపారులకు హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ పట్టణంలో ఉన్న ఎరువుల దుకాణాలను రామావు, ఎఒ పోలారావులు వేర్వేరుగా పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

సోంపేట : సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్, ఎఒ బి.నరసింహమూర్తి స్థానిక అధీకృత ఎరువుల దుకాణాలను పరిశీలించారు. జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ, సోంపేట కేంద్రం ఇన్‌ఛార్జి పి.రాజేశ్వరరావు మాట్లాడుతూ రబీ పంటలకు అవసరమైన యూరియా, డిఎపిలను నిల్వ కోసం సిఫార్సు చేశామన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని శివబాలాజీ రైతు డిపోలోని ఎరువులను ఎఒ మెట్ట మోహనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మెళియాపుట్టి : మండలంలోని కరజాడ రైతు సేవ కేంద్రం, కోసమాల పిఎసిఎస్, గోకర్ణపురం శ్రీనివాస్, సాయిబాలాజీ ట్రేడర్లను ఎఒ దానకర్షుడు పరిశీలించారు.

నందిగాం : నందిగాంలోని ఓ ప్రయివేటు దుకాణాన్ని ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ధరల పట్టిక, వాటి వివరాలను పరిశీలించారు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలాస : రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ రామారావు

బూర్జ : రబీ రైతులకు సకాలంలో యూరియాను సరఫరా చేయాలని ఎరువుల దుకాణదారుల యజమానులకు ఎఒ డి.ఉషారాణి ఆదేశించారు. బూర్జలో యూరియా దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

లావేరు : ఎరువుల షాపుల్లో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రణస్థలం డివిజన్ వ్యవసాయ సహాయశాఖ ఎడిఎ వి.శ్రీనివాసరావు యజమానులను హెచ్చరించారు. మండలంలోని వెంకటాపురంలో విజయలక్ష్మి ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎఒ డి.మహేష్‌నాయుడు పాల్గొన్నారు.